9491041435కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించండి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

త్వరలో జరగబోయే ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్యల కోసం వాట్సాప్ మెసేజ్, ఫొటోల ద్వారా వాస్తవ సమాచారం ప్రజలకు అధికార యంత్రాంగానికి అందించాలని కోరారు. దీనికి వాట్సాప్ నెంబర్ 9491041435 అందుబాటులో ఉంచామని, ప్రజలు దీన్ని వినియోగించుకుని ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

కాంగ్రెస్ రె'ఢీ'..!

- 14 అసెంబ్లీ స్థానాలకుగాను 12 చోట్ల అభ్యర్థుల ప్రకటన
- పలు నియోజకవర్గాల్లో బరిలోకి బలమైన అభ్యర్థులు
- ప్రధాన పార్టీల గెలుపోటములను తారుమారు చేయనున్నట్లు చర్చ
- నరసాపురంలో ప్రధాన పార్టీలకు భిన్నంగా కాపు సామాజిక తరగతికి టిక్కెట్
- ఎంపీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఇంకా వీడని సస్పెన్స్
- బిజెపిపై కోపంతో ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌కు ఓట్లు ఎక్కువగా పడే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర విభజన తర్వాత కొత్త ఊపుతో కాంగ్రెస్ ఈసారి సాధారణ ఎన్నికల బరిలోకి దిగుతోంది. ప్రధాన పార్టీలకు ధీటుగా నిలబడే అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసినట్లు స్పష్టమవుతోంది. కాంగ్రెస్ అధిష్టానం మంగళవారం అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా 12 చోట్ల అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఏలూరు, ఆచంట నియోజకవర్గాలకు సంబంధించి ఇంకా పెండింగ్ ఉంది. ఇండియా వేదికలో భాగంగా ఏలూరు నుంచి సిపిఐ పోటీ చేయనున్నట్లు తెలియగా, ఆచంటలో పోటీలో ఉండే అభ్యర్థిపై స్పష్టత రావాల్సి ఉంది. కాంగ్రెస్ తమ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ప్రధాన పార్టీల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థుల్లో ఎవరికి నష్టం జరుగుతుందనే లెక్కలు కడుతున్న పరిస్థితి నెలకొంది. చింతలపూడి వైసిపి ఎంఎల్ఎగా ఉన్న ఉన్నమట్ల ఎలిజా ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ చింతలపూడి టిక్కెట్ కేటాయించింది. ప్రస్తుతం ఎంఎల్ఎగా ఉన్న ఆయనకు ప్రత్యేక కేడర్ సైతం ఉంది. అంతేకాకుండా చింతలపూడి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు సంప్రదాయ ఓటు బ్యాంకు సైతం కొంత ఉంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఈ నియోజకవర్గంలో 3,645 ఓట్లు వరకు వచ్చాయి. ఎంఎల్ఎగా ఎలిజాకు ఉన్న బలంతో పాటు కాంగ్రెస్ సంప్రదాయ ఓటింగ్‌తో ఈ నియోజక వర్గంలో గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. దీంతో వైసిపికి నష్టం చేకూరుతుందా, లేక టిడిపికి ఇబ్బంది వస్తుందా అనే చర్చ సాగుతోంది. ఇక నరసాపురం నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన వైసిపి క్షత్రియకు, జనసేన మత్స్యకార అభ్యర్థికి సీటు ఇచ్చాయి. ఈ నియోజకవర్గంలో కాపు సామాజిక తరగతి ఎక్కువగా ఉందని, అయితే ప్రధాన పార్టీలు కాపులకు సీటు ఇవ్వలేదనే చర్చ ఇప్పటికీ నడుస్తూనే ఉంది. ఈ తరుణంలో కాంగ్రెస్ కాపు సామాజిక తరగతికి చెందిన న్యాయవాది కానూరి ఉదయభాస్కర్ కృష్ణప్రసాద్‌కు టిక్కెట్ ఇచ్చింది. దీంతో కాపు ఓట్లు కొంతమేర చీలే అవకాశం ఉందనే అంచనాలు వేస్తున్నారు. పోలవరం అభ్యర్థిగా ప్రకటించిన దువ్వాల సృజన సైతం బలమైన అభ్యర్థిగా అంతా చెబుతున్నారు. ఈమె వైసిపి నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చారు. ప్రజా సమస్యలపై గళమెత్తిన స్వభావం ఉంది. దీంతో ఈమె తక్కువగా లెక్కించినా 20 వేల ఓట్లు వరకూ చీల్చే అవకాశం ఉందని లెక్కలు కడుతున్నారు. ఉండి నియోజవకర్గం కాంగ్రెస్ టిక్కెట్ దక్కించుకున్న వేగేశ్న వెంకటగోపాలకృష్ణ సైతం ఎన్నికల బరిలో ప్రభావం చూపే అభ్యర్థిగా చెబుతున్నారు. ఈయన యూత్ కాంగ్రెస్ నాయకుడుగా ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ సాగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటనతో అంతటా చర్చ మొదలైంది. కాంగ్రెస్ ఎవరి ఓట్లకు గండి కొడుతుందోనని లెక్కలు కడుతున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో టిక్కెట్ దక్కించుకున్న అభ్యర్థులు సైతం ప్రభావం చూపే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జిల్లాలో ఒక్కశాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈసారి ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదయ్యే అవకాశం కన్పిస్తోంది.

పార్లమెంట్ స్థానాల్లో అత్యధిక ఓటింగ్ వచ్చే అవకాశం..?

ఇప్పటి వరకూ కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా ఐదు పార్లమెంట్ స్థానాలకు సంబంధించి మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. జిల్లాలోని ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. కేంద్రంలోని బిజెపిపై జనాల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. ప్రత్యేక హోదా, రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టుకు నిధులు వంటివే కాకుండా, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు పూనుకోవడం వంటి అనేక అంశాలపై బిజెపి వైఖరిపై జిల్లా ప్రజానీకంలోనూ తీవ్ర వ్యతిరేకత ఉంది. టిడిపి, జనసేన, బిజెపి పొత్తుతో ఈసారి ఎన్నికల బరిలోకి దిగాయి. దీంతో అసెంబ్లీ ఓటు టిడిపి కూటమి లేదా వైసిపిలో నచ్చిన అభ్యర్థికి వేసుకుని, ఎంపీ ఓటు మాత్రం కాంగ్రెస్ అభ్యర్థికి వేయాలన్న చర్చ జనంలో నడుస్తోంది. లోకసభలో కాంగ్రెస్ ఓటుబ్యాంకు పెరిగితే బిజెపికి ఎదురుదెబ్బగా ఉంటుందనే అభిప్రాయం చాలావరకు జిల్లాలో వ్యక్తమవుతోంది. దీంతో అసెంబ్లీ స్థానాల్లో కంటే లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు ఎక్కువగా ఓట్లు వచ్చే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది.

ఆలపాటి నరసింహామూర్తి దెందులూరు

బొడ్డు నోబుల్ కైకలూరు

ఎ.సీతారాం భీమవరం


ఉన్నమట్ల ఎలిజా చింతలపూడి

పాతపాటి హరికుమార్‌రాజు ఉంగుటూరు

కడలి రామారావు తణుకు


వేగేశ్న గోపాలకృష్ణంరాజు ఉండి

కానూరు ఉదయభాస్కర్‌కృష్ణప్రసాద్, నరసాపురం

కొలుకులూరి అర్జునరావు పాలకొల్లు

మార్నీడి శేఖర్ (బాబ్జి) తాడేపల్లిగూడెం

దువ్వాడ సృజన పోలవరం


మరీదు కృష్ణ నూజివీడు

కుమ్మరిరేవువాసుల దాహార్తి తీర్చాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలోని 29వ డివిజన్ కుమ్మరిరేవు ప్రాంతంలో 20 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్న పేద ప్రజల దాహార్తిని తీర్చాలని సిపిఎం నగర నాయకులు బి.సోమయ్య, జె.గోపీ డిమాండ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట కుమ్మరి రేవు ప్రాంత మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వేసవి రాక ముందునుంచే నెల రోజులుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, మున్సిపల్ కుళాయిలు ఉన్నా తాగునీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కుమ్మరిరేవు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని, ఏటిగట్టు ప్రాంతంలోనే దాదాపు 200 కుటుంబాలకు తాగునీరు అందడం లేదని తెలిపారు. ట్యాంకర్ల ద్వారానైనా నీరందించాలని కోరారు. ధర్నా అనంతరం నగర పాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ కుమ్మరిరేవు ఏటిగట్టు ప్రాంతంలో బోర్‌వెల్ వేస్తామని, కుమ్మరి రేవు ప్రాంతానికి ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్ల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాకు జి.ఏసుబాబు, సిహెచ్.కళావతి, కె.అప్పలనరసమ్మ, కె.సావిత్రి, కె.బేబీ నాయకత్వం వహించారు.

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ఎన్నికల ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్‌మోహన్ మిశ్రా

ప్రజాశక్తి - ఏలూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను పరిశీలించేందుకు మంగళవారం స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రా ఏలూరు విచ్చేశారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్‌రూమ్‌ను సందర్శించారు. తొలుత మీడియా కంట్రోల్ రూమ్ నిర్వహణ తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాలో ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరును ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అందుకు సంబందించిన వివరాలను తెలియజేస్తూ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదులకు సంబందించి వివరాలు కంట్రోల్ రూం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, సంబంధిత రిటర్నింగ్ అధికారులకు చేరవేయబడుతుందని, పిమ్మట అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. అనంతరం సోషల్ మీడియాలో వచ్చే అంశాలపై స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రా ఏవిధంగా వాటిని పరిష్కరిస్తుందో సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సోషల్ మీడియాకు సంబంధించి ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, మాధ్యమాలలో వచ్చే రాజకీయపరమైన ప్రకటనలు, సంబంధిత అంశాలను పరిశీలించి వాటిని సంబంధిత రిటర్నింగ్ అధికారులకు పంపడం ద్వారా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అనంతరం సి విజిల్ పర్యవేక్షక విభాగాన్ని స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రా పరిశీలించారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీం లు, ఫ్లైయింగ్ సర్వేలెన్స్ టీంలు క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జిపిఎస్ విధానం ద్వారా ఆయా వాహనాలు ఎక్కడ ఉన్నది, ఆయా నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణా తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఎన్నికల కమిషన్‌కు రోజూవారీ నివేదికలు పంపే విభాగాన్ని ఆయన సందర్శించారు. అనంతరం జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి, స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రాకు వివరించారు. తొలుత జిల్లాలో జరుగుతున్న స్వీప్ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రా తిలకించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్ఓ డి.పుష్పమణి, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎన్ఎస్ కె.ఖాజావలి, ఎం.సూర్యతేజ, వై.భవాని శంకరి, కె.అద్దయ్య పాల్గొన్నారు.


మీడియా కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న రామ్ మోహన్ మిశ్రా

ఉత్సాహంగా 'సిఆర్‌ఆర్ పాఠశాల' ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే

హాజరైన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ దంపతులు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే అనేది ప్రీ ప్రైమరీ విద్యార్థుల భవిష్యత్తుకు కొత్త పునాదులు వేసేదిగా ఉంటుందని, ఇది కేవలం విద్యార్థులకే కాదు తల్లిదండ్రులకు కూడా గర్వించదగ్గ రోజని సర్ సిఆర్ రెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. ఏలూరులోని స్థానిక సర్ సిఆర్ రెడ్డి పాఠశాలలో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రీ గ్రాడ్యుయేషన్ సభకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఆయన సతీమణి డా.మానస హాజరై తమ కుమార్తె రాశ్మి శహస్ర అన్విత ప్రీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని ఆనందంగా తిలకించారు. సాధారణ తల్లిదండ్రుల లాగే కలెక్టర్ దంపతులు హాజరై ఆసాంతం అందరి మధ్యలో కూర్చొనడం చూసిన పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సర్ సిఆర్ రెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడపాలని, వారితో ఆటపాటల్లో పాల్గొనాలని అన్నారు. అలా చేస్తే పిల్లలకు తల్లిదండ్రులపైన అపారమైన ప్రేమ ఏర్పడుతుందని, అంతేకాక తల్లిదండ్రులకు తగిన వ్యాయామం కూడా లభిస్తుందన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించడానికి సర్ సిఆర్ రెడ్డి విద్యాసంస్థలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ సాయికుమారి శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను, సమాజం పట్ల గౌరవభావాన్ని, పరిశుభ్రత, సమయపాలన ప్రాముఖ్యతను తెలియజేసే విద్యను అందించి వారిని భవిష్యత్తులో గొప్ప పౌరులుగా తీర్చిదిద్దడమే మా పాఠశాల ప్రధాన ధ్యేయమని తల్లిదండ్రులకు తెలిపారు. కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్ని తమ విలువైన సమయాన్ని వెచ్చించినందుకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఫస్ట్ క్లాస్‌కు ప్రవేశం పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జాయింట్ సెక్రటరీ కొడాలి వెంకట సుబ్బారావు, పాఠశాల కరస్పాండెంట్ పాల్గొన్నారు.

అందని సాగునీరు.. ఎండిన పైరు

నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

పొలాల్లో బైక్, సైకిళ్లు నడిపి అన్నదాతల నిరసన

సాగునీటి కోసం రైతుసంఘం ఆధ్వర్యంలో రైతుల ధర్నా

ప్రజాశక్తి - దెందులూరు రూరల్

సాగునీరు అందక ఎండిన పంట పొలాల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అన్నదాతలు బైక్, సైకిళ్లు నడిపి నిరసన వ్యక్తం చేసిన ఘటన మంగళవారం ఏలూరు రూరల్ మండలం మల్కాపురంలో చోటుచేసుకుంది. అనంతరం ఎండిన వరి దుబ్బులతో రైతులు, కౌలు రైతులు ధర్నా చేపట్టారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే పంటలు ఎండిపోయి నష్టపోతున్నామంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నెల రోజులుగా సాగునీరు అందక పంట ఎండిపోతున్నా జల వనరుల శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. ఎకరాకు రూ.40 వేలకుపైగా అన్నదాతలు పెట్టుబడి పెట్టారని చెప్పారు. కష్టపడి సాగు చేసిన పంట కళ్లెదుటే ఎండిపోవడంతో ఆత్మహత్యలే గత్యంతరం అంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్నా పట్టించుకునే దిక్కు లేదన్నారు. జిల్లా కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న మల్కాపురంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా జిల్లా కలెక్టర్, వ్యవసాయ, జలవనుల శాఖ అధికారులు సాగునీటి సమస్యపై దృష్టి సారించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి యుద్ధ ప్రాతిపదికన సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంట ఎండిపోయి నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్నదాతలను ఆదుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైతులు గొర్రెల సాంబశివరావు, బత్తుల అప్పారావు, తాటికొండ నరేంద్ర మాట్లాడుతూ నెల రోజులుగా సాగునీరు అందక వేలాది రూపాయలు అప్పు చేసి పెట్టుబడి పెట్టిన పంటలు ఎండిపోతున్నాయని, నష్టపోయిన రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రాల శోభన్‌బాబు, ఆదాడ దుర్గారావు, గుర్రాల ఏడుకొండలు, లావేటి గోవింద్, ఇ.శివన్నారాయణ, కె.అమ్మినాయుడు, పుట్టి రాంబాబు, లంకా పండు, నెరుసు అప్పారావు, కె.రంగారావు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న కలెక్టర, ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా ప్రజలు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం నుండి పోలీస్ సిబ్బంది, సాయుధ దళాల సిబ్బందితో నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పి డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసిందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి జిల్లాలో పోలీస్, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖల ఆధ్వర్యంలో చెక్‌పోస్టుల వద్ద స్టాటిక్ సర్వే లైన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టి), ఫ్లయింగ్ సర్వేలైన్స్ టీమ్‌లు (ఎఫ్ఎస్‌టి), వీడియో నిఘా బృందాలు (విఎస్‌టి) ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఎనిమిది వేల నుండి 10 వేల వరకు పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. దీనిలో కేంద్ర బలగాలు (సిఐఆర్ఎఫ్) 3 బృందాలు జిల్లాకు కేటాయించామని, అందులో రెండు బృందాలు ప్రస్తుతం జిల్లా అంతటా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఏలూరు నగరంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. బ్యానర్లు, ర్యాలీలు, పోస్టర్లు, పబ్లిసిటీ, ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే రాజకీయపక్షాలకు అవగాహన పరిచామన్నారు. దీనికి సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. ప్రతి ఓటరూ ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని, దీనిలో భాగంగా పోలీస్ శాఖ ద్వారా ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించి ప్రజలకు ఓటును నిర్భయంగా వేసుకోవడానికి మేమున్నామనే భరోసాతో అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా ఎస్పి డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ఓటుహక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతును నిర్వహిస్తూ ప్రజలకు ధైర్యం, భరోసా కల్పిస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ప్రజలకు ఎస్పి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఓ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి, నగరపాలక సంస్థ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు, సిఐలు మల్లేశ్వరరావు, రాజశేఖర్, ప్రభాకర్‌రావు, వి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ.పవన్‌కుమార్, ఎస్ఐ లక్ష్మణ్‌బాబు, సాదిక్, ప్రసాద్, మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ మాలతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎస్‌పి మేరీప్రశాంతి

5న నరసాపురం, పాలకొల్లులో చంద్రబాబు పర్యటన

గోపాలపురం నుంచి నేరుగా హెలికాప్టర్‌లో నరసాపురం

ఆరో తేదీన అభ్యర్థులు, నేతలతో సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాగళం యాత్రలో భాగంగా ఈ నెల ఐదో తేదీ శుక్రవారం నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై టిడిపి నాయకులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ నెల ఐదో తేదీ ఉదయం గోపాలపురంలో టిడిపి నాయకులతో సమావేశ అనంతరం హెలికాప్టర్‌లో నేరుగా నరసాపురం చేరుకుంటారు. స్థానిక జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడ నుంచి పాలకొల్లు చేరుకుని స్థానిక జంక్షన్‌లో 15 నిముషాలు ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. అనంతరం రాత్రికి పాలకొల్లులోనే బస చేస్తారు. ఆరో తేదీ ఉదయం పాలకొల్లులో టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించి అక్కడనుంచి నరసరావుపే బయల్దేరి వెళ్తారు.

కొనసాగిన 'పది' మూల్యాంకనం

ఏలూరు స్పోర్ట్స్ :పదో తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం మంగళవారం రెండోరోజుకు 23 శాతానికి చేరుకుందని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం తెలిపారు. ఏలూరు నగరంలోని సెయింట్ జేవియర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల పేపర్ల మూల్యాంకనం రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మూల్యాంకనం సాగుతుందని తెలిపారు.

వైసిపి హయాంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సిహెచ్.రాజేశ్వరి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రాన్ని ఒక ప్రయోగశాలగా మార్చారని, దేశంలో ఎక్కడా అమలు చేయనటువంటి విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సిహెచ్.రాజేశ్వరి అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గత నెల మార్చి 23వ తేదీన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించారు. మంగళవారం ఆ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కాలేజిస్థాయి పట్టణ ప్రాంతంలో మొదటి, రెండు, మూడు బహుమతులు అందజేశారు. దీనిలో భాగంగా ఏలూరు పట్టణంలో సిఆర్ రెడ్డి మహిళా కళాశాలలో బహుమతి ప్రధానోత్సవం జరిగింది. రెండో బహుమతి ఎ.కృష్ణ, మూడో బహుమతి కె.భాను ప్రీతికి ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సిహెచ్.రాజేశ్వరి బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు మహిళకు పెద్దపీట వేస్తాము, ఎల్‌కెజి నుంచి పిజి వరకు చదువు పూర్తిగా ఉచితంగా అందిస్తామని తెలిపిన జగన్‌మోహన్‌రెడ్డి నేడు విద్యను కార్పొరేట్‌పరం చేసేశాడన్నారు. మాట తప్పం, మడం తిప్పం అన్న జగన్ నేడు కార్పొరేట్ విద్యా వ్యవస్థకు కొమ్ము కాస్తున్నాడని ఎద్దేవా చేశారు. నూతన విద్యా విధానం వల్ల విద్యార్థులు చదువుకు దూరం అవుతారని, దేశంలో మహిళల ప్రాధాన్యత ఇప్పుడిప్పుడే అగ్రస్థానంలో నిలబడుతుందని, దాన్ని తొక్కేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మరంగా పనిచేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేనిచో పెద్దఎత్తున ఆందోళన, పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఠాగూర్, కె.లెనిన్, పట్టణ ఉపాధ్యక్షులు ఎం.జానకిశ్వరావ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రచారం నిర్వహిస్తున్న వాసుబాబు

పూళ్లలో 'మన ఊరికి మన వాసన్న'

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ళ గ్రామంలోని పడమర దళితవాడలో మంగళవారం నిర్వహించిన 'మన ఊరికి మన వాసన్న' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసు బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సదరు ఆవాస ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను ఆయన కలిశారు. ముఖ్యమంత్రిగా వైఎస్‌.జగన్మోహన్‌ రెడ్డిని చేసే క్రమంలో తనతో పాటు ఏలూరు పార్లమెంటరీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.సునీల్‌, ఉంగుటూరు ఎంఎల్‌ఎగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల స్థాయి ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

ఆర్‌డిఒ ఖాజావలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రభుత్వ నిబంధనల విరుద్ధంగా అక్రమంగా మట్టి తరలించినా, లేఅవుట్లు ఏర్పాటు చేసినా వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి అన్నారు. మంగళవారం దెందులూరు మండలంలోని గ్రామపంచాయతీ పరిధిలోని టిటిడి కళ్యాణ మండపం సమీపంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను దెందులూరు తహశీల్దార్‌ జితేంద్రతో కలిసి వచ్చి పరిశీలించారు. అనుమతి లేకుండా ల్యాండ్‌ కన్వర్షన్‌ లేకుండా ఇరిగేషన్‌ స్థలాన్ని ఆక్రమించి తోరలు వేసిన వాటిని వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఆగమేఘాల మీద అక్రమంగా పెట్టిన తోరలను, మట్టిని తరలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ ఖాజావలి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే గ్రామ రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటామని, ఇప్పటినుంచైనా బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఈ సందర్భంగా లేఅవుట్ వద్దకు వెళ్లి అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅట్‌ను పరిశీలించి, లేఅవుట్ ఓనర్‌కు అపరాధ రుసుము వేయడం జరిగిందని, కేసు కూడా నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

జగనన్న సురక్ష సేవలు వినియోగించుకోవాలి

వైద్య పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత

ప్రజాశక్తి - భీమడోలు

ప్రత్యేక వైద్య నిపుణులు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా స్థానికంగా అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత కోరారు. గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో భీమడోలు గ్రామ సచివాలయం-1 వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. దీనిలో పాల్గొన్న ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.సునీత(స్త్రీ, ప్రసూతి వైద్య సేవలు), డాక్టర్ కె.శ్రీలక్ష్మి, డాక్టర్ ఆర్.జాహ్నవి(సాధారణ వైద్య సేవలు), డాక్టర్ ఆర్.సుధాకర్(ఎముకలు సంబంధిత వైద్య సేవలు), డాక్టర్ ఒ.వి.రెడ్డి(కంటి వైద్య సేవలు) అందజేశారు. వీరికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన సిబ్బంది సహకారాన్ని అందజేశారు. ఈ శిబిరంలో 416 మందికి వైద్య పరీక్షలను చేసి మందులను అందజేశారు. ఆరుగురికి కంటి చికిత్స, నలుగురికి ఉన్నత స్థాయి వైద్యం కోసం జిల్లా కేంద్ర వైద్యశాలకు సిఫార్సు చేశారు.

ప్రచారం నిర్వహిస్తున్న ముద్దరబోయిన

'సమస్యలపై అవగాహన ఉంటేనే అభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన వున్న వారికే నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని, గత పది సంవత్సరాలలో ప్రతి గడపకూ వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్న తనకు వాటిని ఏ విధంగా పరిష్కరించాలో తెలుసుని నూజివీడు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి ముద్రబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలకేంద్రమైన చాట్రాయిలో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ప్రతి ఊరికి, ప్రతి ఇంటికి తాను వెళ్లానన్నారు. వారి సమస్యలు ఏమిటో, నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చో తనకు తెలుసన్నారు. పార్టీలకు అతీతంగా స్వతంత్ర అభ్యర్థిగా ఇక్కడ గెలిస్తే అధికారంలోకి వచ్చేది ఏ పార్టీ అయినా నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గత 15 సంవత్సరాలుగా మెట్ట ప్రాంతమైనటువంటి నూజివీడు నియోజకవర్గంలో సాగునీరు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి అయితే ఇక్కడ తాగు, సాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. చాట్రాయి మండలంలో ఎన్ఎస్‌పి కాలువలు ఉన్న వాటి నుంచి నీటి లభ్యత అంతంత మాత్రమే ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు కృషి చేస్తే నూజివీడు నియోజకవర్గం మరో కోనసీమగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

రిటర్నింగ్ అధికారి సూర్యతేజ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియేగించుకునేలా ఏర్పాట్లు చేయాలని పోలవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ సూచించారు. మండలకేంద్రమైన టి.నరసాపురంలో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు సమయం ఉందని తెలిపారు. 85 ఏళ్ల పైబడి నడవలేని, లేవలేని వారికి, పిడబ్ల్యూడి ఓటర్లకు ఇంటి వద్ద నుంచే ఓటు వేయుటకు తగిన ఏర్పాట్లు చేయాలని, పోలింగ్ కేంద్రం వద్ద తహశీల్దార్, బిఎల్ఒల ఫోన్ నెంబర్లు ప్రదర్శన చేయాలని, వివాదాస్పద పోలింగ్ కేంద్రాలు గుర్తించాలని తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ టి.శుభాష్, ఎంఇఒ టి.రామ్మూర్తి, ఇఒపిఆర్‌డి ఉన్నారు.

కేంద్రాలను పరిశీలిస్తున్న సూర్యతేజ

నేరాలు - ఘోరాలు

నాటుసారా తయారీ స్థావరంపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని సిద్ధార్థ నగర్ గ్రామంలో మంగళవారం నాటుసారా స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో 50 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించామని నాటుసారా కాస్తున్న ముకుంద(48) పరారైనట్లు, అతనిపై కేసు నమోదు చేసినట్లుగా ఎఎస్ఐ అన్నారు. వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సువిధ ద్వారా అందిన 443 అభ్యర్థనలకు అనుమతులు

జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా అందిన అభ్యర్థనలలో ఇంతవరకూ 443కు అనుమతులు ఇవ్వటం జరిగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 705 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకూ 443 అనుమతులు జారీ చేయగా, మరో 17 పరిశీలనలో ఉన్నాయన్నారు. సరైన రీతిలో దరఖాస్తు చేయబడని 245 తిరస్కరించబడ్డాయన్నారు. సి-విజిల్ ద్వారా 214 ఫిర్యాదులు అందగా వాటిలో 121 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మరో 93 ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు తిరస్కరించబడ్డాయన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 71 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. యఫ్‌యస్‌టి, యస్‌యస్‌టి, పోలీస్ ఎన్ఫోర్స్మెంట్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ.133.68 లక్షల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు. వీటిలో రూ.47.54 లక్షలు నగదు కాగా రూ.81.75 లక్షలు విలువైన మద్యం, రూ.3.86 లక్షలు ఇతరాలు వున్నాయన్నారు. స్వీప్ కార్యక్రమం కింద జిల్లాలో ఇప్పటి వరకు 1,715 కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

ఆరోగ్య కార్యక్రమాల్లో 'ఆశాల' పాత్ర కీలకం

అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జె.గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అనేక జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులోను, అంటువ్యాధుల నిర్మూలనలోనూ ఆరోగ్య, ఆశా కార్యకర్తల పాత్ర చాలా కీలకమని, సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఆశా డే సందర్భంగా స్థానిక ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన పవర్ పేట, ఎంఆర్‌సి కాలనీ, ఎఎస్ఆర్ కాలనీ, పిహెచ్‌సి పరిధిలో జరుగుతున్న ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలు వడదెబ్బ, ఇతర అంటువ్యాధులకి గురయ్యే అవకాశం ఉంది కాబట్టి ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తమ ఇంటింటి గృహ దర్శనాలలో ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణా మార్గాల గురించి చెప్పాలన్నారు. అలాగే అనేక జాతీయ కార్యక్రమాలైన తల్లీ బిడ్డ సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలోనూ, దోమల ద్వారా వచ్చే వ్యాధులైన డెంగీ, మలేరియా నిర్మూలన కార్యక్రమంలోనూ ఆశా, ఆరోగ్య కార్యకర్తల సేవలు అభినందనీయమని తెలిపారు. అలాగే వైరల్ జ్వరాల పట్ల, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య సూత్రాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా మాస్ మీడియా అధికారి దేమెం నాగరత్నం మాట్లాడుతూ స్త్రీ గర్భం దాల్చిన వెంటనే పిహెచ్‌సిలో నమోదు చేసుకోవాలని, గర్భిణీ స్త్రీకి అవసరమైన వైద్య సేవలు అందించాలని, గర్భిణీ స్త్రీ రక్తహీనతతో బాధపడకుండా తగు సూచనలు ఇవ్వాలని తెలిపారు. గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్షలు నేరమని పిసి సూచించారు. అనంతరం ఆడపిల్లలను సంరక్షించు - ఆడపిల్లలను చదివించు, బేటి బచావో - భేటీ పడావో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గౌతమ్, సీతామహాలక్ష్మీ, హెల్త్ సూపర్వైజర్, ఝాన్సీ, జి.శ్రీనివాసరావు, రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు ఆశాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోవిందరావు

24 గంటల్లో 70 లీటర్ల మద్యం స్వాధీనం

ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గడచిన 24 గంటల్లో చెక్‌పోస్టుల్లో తనిఖీ నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 70 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాటి ద్వారా నగదు, మద్యం అక్రమ రవాణాపై పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా గడచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 70 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.23,590 ఉంటుందని తెలిపారు. అలాగే ప్రత్యేక తనిఖీల ద్వారా రూ.10,85,610 నగదును గుర్తించామని అన్నారు. వీటిని స్వాధీనపరుచుకుని నగదు రవాణా చేస్తున్న వారి నుంచి వివరాలు సేకరించే పనిలో ఉన్నామని జిల్లా ఎస్‌పి స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో వచ్చినప్పటి నుంచి మొత్తం 31 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలను ప్రత్యేకంగా తనిఖీల కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. సాయుధ బలగాలతో సున్నితమైన ప్రాంతాలలో ఇప్పటికే కవాతు నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగబద్ధంగా ఓటు హక్కును వినియోగించుకునే ప్రక్రియకు స్వేచ్ఛను కల్పించేందుకు పూర్తి స్థాయిలో ఓటర్లకు భద్రత కల్పించే దిశగా పోలీస్ శాఖ చర్యలు చేపడుతుందని ఆమె తెలిపారు.

వికలాంగుల సేవాసమితి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

వికలాంగుల సంక్షేమానికి గుండుగొలను కేంద్రంగా పనిచేస్తున్న శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవాసమితి అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో నెలవారీ వితరణలో భాగంగా 55 మంది వికలాంగులకు సన్నబియ్యం, పండ్లు, పౌష్టికాహారాన్ని మంగళవారం అందజేశారు. వీటిని దాత ఇందుకూరి సత్యనారాయణ రాజు తన సమీప బంధువు దాట్ల సూర్యనారాయణ రాజు జ్ఞాపకార్థం అందజేశారని సంఘం ప్రతినిధి శ్యామల రాజు తెలిపారు. ఇదే క్రమంలో ఏలూరుకి చెందిన ఫిజియోథెరపిస్టులు డాక్టర్ జి.రాంబాబు, డాక్టర్ కంబయ్య వికలాంగులకు వైద్య సేవలను అందించారు. చికిత్స కొనసాగింపుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంఘానికి చెందిన శాశ్వత దాతలు దాట్ల సీతారామరాజు, దాట్ల రామకృష్ణంరాజుతో పాటు సంఘ ప్రతినిధులు జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కుష్టు వ్యాధి వైద్య నిపుణులు డి.శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. గుంటూరు నుంచి వచ్చిన కుష్టు వ్యాధి వైద్య బృందంతో కలిసి ఆయన మంగళవారం మండలంలోని కామయ్యపాలెం, రాచన్నగూడెం, జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలలో నమోదైన కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారి రక్త నమూనాలు సేకరించి, వ్యాధి నిర్ధారణ అయిన యెడల తగు జాగ్రత్తలు తీసుకుంటూ మందులు వాడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల వ్యాప్తంగా అనుమానిత వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ రామకృష్ణ, వైద్యాధికారిణిలు బి.గాయత్రి, దివ్య, ఫార్మసిస్ట్ నాగేశ్వరావు, సిహెచ్ఒ శ్రీనివాసరాజు, ల్యాబ్ టెక్నీషియన్ మంగతాయారు, ఎఎన్ఎంలు, ఆశాలు

ఉపాధి హామీ పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వి.రమేష్‌కు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చాట్రాయి మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, గ్రామ కార్యదర్శి టి.ప్రసాద్ ఆధ్వర్యంలో వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ఏప్రిల్ వచ్చి రెండు రోజులు గడుస్తున్నా పనులు కల్పించకపోవడం అన్యాయమన్నారు. చిన్నంపేట గ్రామంలో వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించాలని, 200 రోజులు పనులు కల్పించి, రూ.600 వేతనం ఇవ్వాలని తెలిపారు. పే స్లిప్పులు ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

వినతిని అందిస్తున్న వ్యకాస నాయకులు

ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి

వైసిపి చింతలపూడి అభ్యర్థి కంభం విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని వైసిపి చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైసిపి సీనియర్ నాయకులు సాయిబాబా తండ్రి అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న విజయరాజు వారి నివాసానికి వెళ్లి సాయిబాబా తండ్రిని పరామర్శించారు. అనంతరం గ్రామంలో ఉన్న మేరీమాత విగ్రహానికి పూలమాలలు వేసిన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గడపకు వెళ్లి ఓటర్లను అభ్యర్థిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తే మరోసారి రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. అందువల్ల ప్రతి ఓటరు కూడా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపి విజయానికి తోడ్పడాలని కోరారు. సంక్షేమ పథకాల అభివృద్ధి చూసి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ వైసిపి నాయకులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న విజయరాజు

భారీ మెజారిటీతో గెలిపించాలి

జనసేన పోలవరం అభ్యర్థి చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి పోలవరం నియోజకవర్గ అభ్యర్థిగా తనను అధిక మెజారిటీతో గెలిపించాలని చిర్రి బాలరాజు కోరారు. మండలంలో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా మండలంలోని అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం పంచాయతీల్లో ప్రచారం నిర్వహించి, స్థానిక టిడిపి, బిజెపి నాయకులను, కార్యకర్తలను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలిపిస్తే పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య, నవీన్, పెంటారావు, మాండ్రు రాంబాబు పాల్గొన్నారు.

ప్రచారంలో చిర్రి బాలరాజు

నవోదయకు పలువురు విద్యార్థులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.నారాయణపురం, ఎంపియుపి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పి.కుసుమ శ్రీలాస్య ఇటీవల జరిగిన పరీక్షల్లో జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లాడి రాజు మంగళవారం తెలిపారు. పి.అంకం పాలెం గ్రామానికి చెందిన పాల్గని వెంకటేశ్వరావు, పుష్ప వ్యవసాయ పనులు సాగిస్తూ కుమార్తెను పి.నారాయణపురం పాఠశాలలో చదివిస్తున్నారు. కాగా ఇటీవల జరిగిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష రాయించగా అందులో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, జవహర్ నవోదయకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

జీలుగుమిల్లి: శ్రీలాస్య

టి.నరసాపురం: ఎంపికైన రామకృష్ణ

టి.నరసాపురం: మండలకేంద్రమైన టి.నరసాపురం పరిధిలో ఉన్న మెట్టగూడెం గ్రామానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి ఓసూరి రామకృష్ణ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు విద్యార్థి తండ్రి నాగరాజు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మెట్టగూడెం ఎంపి ఎలిమెంటరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రామకృష్ణ ఇటీవల నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్షరాయగా విడుదలైన ఫలితాల్లో ఎంపికయ్యాడని తెలిపారు.

3 నుంచి 6 వరకు పింఛన్లు పంపిణీ చేయాలి : కలెక్టర్

ఏలూరు: భారత ఎన్నికల సంఘం ఆదేశాలను పాటిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు ఈనెల 3వ తేది బుధవారం నుంచి ఈనెల 6వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, తీవ్రమైన అనారోగ్యం, వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి ఇంటి వద్దే పంపిణీతో పాటు మిగిలిన వారికి పెన్షన్ దారుల సమీపంలోని సచివాలయాల ద్వారా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు.

'నిధుల కొరతే పింఛన్ల జాప్యానికి కారణం'

ఎంపిడిఒలకు వినతులందించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి

సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధులు కొరతే కారణం కాని ఎన్నికల కమీషన్, టిడిపి కాదని టిడిపి ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నాగ రాటాలుకి పింఛన్ల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను సొమ్ములను వైసిపి ప్రభుత్వం పక్కదారి పట్టించడం వల్లే ఒకటవ తేదీ వచ్చినా పింఛన్లు పంపిణీ చేయట్లేదని అన్నారు. అవ్వ, తాతలు ఎవరూ అధైర్య పడనవసరం లేదని, అదేవిధంగా పింఛను పంపిణీ కార్యక్రమంలో టిడిపి, జనసేన కూటమి నేతలు పర్యవేక్షిస్తూ వృద్ధులకు, వికలాంగులకు బాసటగా నిలవాలని కార్యకర్తలకు రోషన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, చింతలపూడి టౌన్ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా, టిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్ పాల్గొన్నారు.


ఏలూరు సిటీ: జెసికి వినతినందిస్తున్న గన్ని

ముసునూరు: వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్ ఇంటి వద్దకే తెచ్చి ఇవ్వాలని ముసునూరు మండల ఎంపిడిఒ ఓ చాగంటి పద్మావతి దేవికి టిడిపి మండల నాయకులు వినతిని అందజేశారు. పెన్షన్ డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారని మంగళవారం ఎంపిడిఒను వారు అడగగా, ఇంకా మాకు పెన్షన్ అమౌంటు అందలేదన్నారు. డబ్బులు మా చేతికి అందితే బుధవారం పంపిణీ చేస్తామని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో పెన్షన్ ఇవ్వడానికి కూడా నిధులు లేకుండా చేశారని వారు మండిపడ్డారు. అప్పుల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని మార్చారని, చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేస్తే తప్ప ఈ రాష్ట్రం అప్పుల నుంచి బయటపడదని అన్నారు. వినతిని అందించిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు దేవినేని ఢలరాం, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, టిడిపి అసెంబ్లీ అభ్యర్థి బడేటి చంటి పింఛన్లు విషయమై మంగళవారం జాయింట్ కలెక్టర్ లావణ్యకు వినతిపత్రం అందించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పింఛన్ పంపిణీ సచివాలయ సిబ్బందికి అప్పగించిందని, వారి సేవలను వినియోగించి ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ చేయాలని టిడిపి జెసికి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని సందర్శిస్తున్న రత్నప్రసాద్

బాలుర వసతి గృహం సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శనివారపు పేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సందర్శించారు. ఈ వసతి గృహంలో బాలలకు అందుతున్న సౌకర్యాలపైన, ఆహార పదార్థాల నాణ్యతపైన ఆరా తీశారు. భుక్తం, ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ పడొద్దని, పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన పోషక ఆహార పదార్థాలను అందించాలని, తద్వారా బాలురు ఆరోగ్యంగా ఉండి చదువును అభ్యసించడానికి, క్రమశిక్షణతో ఉండటానికి తోడ్పడుతుందని సూచించారు. అలాగే అబ్జర్వేషన్‌లోని బాలురకు ఉన్నటువంటి న్యాయ సహాయాలపైన, వారి తల్లిదండ్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజీయే పద్ధతుల్లో అత్యధిక మార్పులు పొందిన విద్యార్థుల ప్రోత్సాహకాలు అందిస్తామని, కావున విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమాధికారి పి.శ్రీదేవి పాల్గొన్నారు.

రూ.11.43 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - ఉంగుటూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలవుతున్న క్రమంలో ఉంగుటూరు నియోజకవర్గంలో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్ కె.ఖాజావలి వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా ఉంగుటూరు మండలంలోని ఉంగుటూరు, గణపవరం నిడమర్రు లో స్టాటిక్ సర్వే లైన్స్ టీమ్, ఎఫ్ఎస్‌టి బృందం జరిపిన తనిఖీల్లో రూ.11,43,700ల నగదు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. స్వాధీన పరుచుకున్న నగదును స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించడమైనదన్నారు. నగదు తీసుకు వెళ్లే సమయంలో సంబంధిత పత్రాలు తమతో ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ తరలిస్తే స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
O.S. No. 13/2023
Between :
1) GAADI GNANA SREE
2) GAADI NAGA MANIKANTA
(Being minors represented by Guardian Father / Gadi Anil Kumar) ... Plaintiffs
AND
BODDU SUDHARSANA & Others ... Defendants
టు,
4వ ప్రతివాది అడ్రస్ : కొప్పాడ మహేష్, S/o : కె.టి.ఎస్.వి.ప్రసాద్, C/o పి.సురేష్, డోర్ నెం. 13-16-44, Proprollu vari, గున్నిపూడి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.
పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం ది. 16-4-2024నకు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరుపబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 16-4-2024
వి.వి.వరదరాజులు
న్యాయవాది
మచిలీపట్నం.
మచిలీపట్నం,
ది.29-3-2024

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
I.A.No. 185/2023 IN O.S. No. 13/2023
Between :
1) GAADI GNANA SREE
2) GAADI NAGA MANIKANTA
(Being minors represented by Guardian Father / Gadi Anil Kumar)
... Petitioners/ Plaintiffs
AND
BODDU SUDHARSANA & Others
... Respondents/ Defendants
టు,
4వ రెస్పాండెంట్/ ప్రతివాది: కొప్పాడ మహేష్, S/o : కె.టి.ఎస్.వి.ప్రసాద్, C/o పి.సురేష్, డోర్ నెం. 13-16-44, Proprollu vari, గున్నిపూడి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.
పై నెంబరు దావాలో 4వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం ది. 16-4-2024నకు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరుపబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 16-4-2024
వి.వి.వరదరాజులు
న్యాయవాది
మచిలీపట్నం.
మచిలీపట్నం,
ది.29-3-2024

మహారాజశ్రీ మొదటి అదనపు జిల్లా కోర్టు, ఏలూరు, ప॥గో॥జిల్లా
M.V.O.P. 43/2020
బిట్వీన్:
కె.యశ్వంత రాయలు -పిటీషనరు
ఎ.శేషగిరిరావు & 5 అదర్స్
-రెస్పాండెంట్లు
R-3: అడబాల దుర్గా భూలక్ష్మి W/o. లేటు శేషగిరిరావు.
R-4: ఎ.రాజు, S/o. శేషగిరిరావు.
R-5: ఎ.స్వామినాయుడు, S/o. శేషగిరిరావు.
R-6: ఎ.బేబి ధనలక్ష్మి, D/o. శేషగిరిరావు.
R/o. D.No. 8-104/ఎ, మత్స్యపురి రోడ్డు, వీరవాసరం (V & M), ప॥గో॥జిల్లా.
పై ఉదహరించిన రెస్పాండెంట్లు 3 to 6 నోటీసు నిమిత్తం ది. 15-4-2024న ఉదయం 10.30 ని॥లకు ఆక్షేపణలున్నచో శ్రీ కోర్టు వారి యందు తెలుపుకోని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
జగ్గవరపు సురేష్‌కుమార్‌రెడ్డి
అడ్వకేటు, ఏలూరు
సెల్: 9441606789
ఏలూరు
30-3-2024